క్లుప్తంగా

నేడు డిగ్రీ కళాశాల్లో జాబ్‌మేళా

వరికుంటపాడు: స్థానిక మేకపాటి రాజమోహన్ రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఉదయం 10 గంటలకు జాబ్‌మేళా జరుగుతుందని ఆ కళాశాల ప్రిన్సిపల్ పి. సుబ్బలక్ష్మమ్మ, వైస్ ప్రిన్సిపల్ ఏ నరసింహులు, ప్లేస్‌మెంట్ అధికారి వెంకటేశ్వర్లు, శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. శ్రీసిటీలోని లక్ష్య సొసైటీ సర్వీసెస్ ఆధ్వర్యంలో అర్హులను ఎంపిక చేస్తారన్నారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, పాస్ లేదా ఫెయిల్ అయిన విద్యార్థులు అర్హులన్నారు. ఎంపికైన వారికి రూ.14 వేలు జీతం ఉంటుందన్నారు. నిరుద్యోగ, యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి



ఆదర్శ రైతును సన్మానిస్తున్న బ్యాంకర్లు

వరికుంటపాడు: రైతులు వ్యవసాయ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ మేనేజర్ వై.రామకృష్ణ చెప్పారు. వింజమూరులో శుక్రవారం జరిగిన జాతీయ రైతు దినోత్సవ వేడుకల్లో మాట్లాడుతూ బ్యాంక్‌ల్లో తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి రాయితీలు పొందాలని కోరారు. బ్యాంక్‌లు అందించే వివిధ రకాల రుణాలపై అవగాహన కల్పించారు. అనంతరం పలువురు ఆదర్శ రైతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ అధికారులు శరత్‌బాబు, కృష్ణమోహన్, జ్యోతి, కోటేశ్వరరావు, బ్రహ్మయ్య తదితరులు ఉన్నారు.

ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం



నూతన ఆలయ కమిటీని సత్కరిస్తున్న దృశ్యం

సంగం: కామాక్షిదేవి సమేత సంగమేశ్వరస్వామి ఆలయంలో ఈఓ వరప్రసాద్ అధ్యక్షతన నూతన ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఆలయ చైర్మన్‌గా పెరుమాళ్ల రవీంద్రబాబు పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆలయ అధికారులు, వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ కంటాబత్తిన రఘునాథ్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య నాయకులు అనుమాలశెట్టి రామారావు, రాంబాబు, గాంధీజన సంఘం సర్పంచ్ మాణికల చందన్‌కుమార్, నరేష్, జహంగీర్, జనార్దన్‌రెడ్డి, చంద్రమౌళి తదితరులు ఉన్నారు.

ముక్కోటికి ముమ్మరంగా ఏర్పాట్లు

ఆత్మకూరు రూరల్: ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని జేఆర్‌పేటలో కొలువైన పద్మావతి, గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయం, తూర్పువీధిలోని శ్రీదేవి, భూదేవి సమేత అలఘునాథస్వామి ఆలయంతో పాటు పలు రామాలయాలు, కాశీనాయన ఆశ్రమంలోని ఆలయాల్లో ముక్కోటి వేడుకలు శనివారం వైభవంగా నిర్వహించనున్నారు. ఆయా ఆలయాల నిర్వాహకులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. వెంకటేశ్వరస్వామి ఆలయంలో వేకువజామున నాలుగున్నర గంటలకే స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్తర ద్వారానికి పూజలు చేసి అనంతరం భక్తులకు ఆ ద్వారం నుంచి దర్శన భాగ్యం కల్పించనున్నట్లు జెడ్పీ మాజీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి తెలిపారు. అలఘునాథస్వామి ఆలయంలో వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్తర ద్వారా దర్శనం ద్వారా భక్తులకు దర్శనం ఏర్పాటు చేసినట్లు, ప్రసాదాలు పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఎస్సీ సెల్ జిల్లా జనరల్ సెక్రటరీగా దేవదాస్



దేవదాస్

జలదంకి: వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా జనరల్ సెక్రటరీగా అన్నవరం పంచాయతీ మాజీ సర్పంచ్ దామెర్ల దేవదాస్ నియమితులయ్యారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ తనకు ఈ పదవి దక్కేందుకు కృషి చేసిన ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాలవల్లి మాలకొండారెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తానని వివరించారు.

పాడి రైతులకు దాణామృతం అందజేత

అల్లూరు: మండలానికి 15 టన్నుల సంపూర్ణ దాణామృతం మంజూరైందని పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకు డాక్టర్ మహేశ్వర్ రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ మిచాంగ్ తుఫాన్ కారణంగా ఇబ్బందులు పడుతున్న పాడి రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా సంపూర్ణ దాణామృతాన్ని మంజూరు చేసిందన్నారు. ఇస్కపల్లి పంచాయతీలో 130 మంది పశుపోషకులకు దాణామృతాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దర్శిగుంట శశిరేఖ, జెడ్పీటీసీ వేణమ్మ, సర్పంచ్ పాటి రంజిత్‌కుమార్, అల్లూరు రూరల్ అధ్యక్షుడు బీద రమేష్, నాయకులు వెంకయ్య, డాక్టర్ మహేశ్వరయ్య, గౌతం తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రాధాన్యత

• మేకపాటి రాజగోపాల్‌రెడ్డి



అయ్యవారిపల్లిలో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

సీతారామపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. మండలంలోని అయ్యవారిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు శుక్రవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ధనవంతులతో సమానంగా పేద పిల్లలకు కూడా కార్పొరేట్ స్థాయి విద్యను ప్రభుత్వ పాఠశాల్లో అందిస్తున్నారన్నారు. పాఠశాల స్థాయి నుంచే డిజిటల్ విద్యను ప్రోత్సహించడంలో భాగంగా విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్నారన్నారు. నాడు- నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయన్నారు. ప్రభుత్వ పాఠశాల్లో ఇంగ్లిష్ మీడియం బోధిస్తున్నారన్నారు. అమ్మ ఒడి, గోరుముద్ద, విద్యాదీవెన, వసతి దీవెన పథకాల ద్వారా పేద విద్యార్థుల భవిష్యత్‌కు జగనన్న భరోసా కలిస్తున్నారన్నారు. విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చింతం రెడ్డి సుబ్బారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ బాలినేని మాబయ్య, సర్పంచ్ దుర్గాప్రసాద్, ఎంఈఓ మస్తాన్‌వలి, ప్రధానోపాధ్యాయుడు పి. సుధాకర్, స్థానిక నాయకులు గుర్రం సుబ్బయ్య, పి. వెంకటరెడ్డి, ఓబులేష్, వీరప్రసాద్, లక్ష్మయ్య, ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఏకగ్రీవ ఆమోదం

• రూ.1,27,50,375 అంచనాల పనులతో అజెండా
• మున్సిపల్ కౌన్సిల్ నిర్ణయం



మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ గోపారం వెంకట రమణమ్మ

ఆత్మకూరు రూరల్: పట్టణంలోని పలు వార్డుల్లో సిమెంట్ రోడ్లు, డ్రైనేజ్ నిర్మాణాలను రూ.1,27,50,375 అంచనాలతో నిర్మించేందుకు కౌన్సిల్ ఏకగ్రీవ ఆమోదం తెలిపింది. ఆత్మకూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ గోపారం వెంకట రమణమ్మ అధ్యక్షతన కమిషనర్ బల్లి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం జరిగింది. తొలుత అజెండాలోని 58 అంశాలపై వాడీవేడి చర్చ సాగింది. 15వ ఆర్థిక సంఘం మొదటి విడత టైడ్ నిధులతో చేపట్టాల్సిన రూ.27,50,224లతో చేపట్టాల్సిన ఐదు పనులకు సైతం ఆమోదం తెలిపారు. కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి మినిట్స్ బుక్ కౌన్సిల్ సమావేశంలో పెట్టాలని డిమాండ్ చేశారు. నెల్లూరుపాళెం వద్ద ఏర్పాటు చేసిన దివంగత గౌతమ్‌రెడ్డి విగ్రహం చుట్టూ ఏర్పాటు చేసిన పార్కుకు మున్సిపల్ నిధులు వాడారని, వాటి లెక్క ఎక్కడా చెప్పలేదంటూ వాదనకు దిగారు. దీంతో 13వ వార్డు కౌన్సిలర్ టి.తిరుపతమ్మ భాస్కర్‌రెడ్డికి సరైన సమాధానం చెప్పారు. వైఎస్సార్‌సీపీ గుర్తుపై గెలిచి అదే పార్టీ ఎమ్మెల్యేను విమర్శించడం సరికాదన్నారు. మేకపాటి కుటుంబం విద్య కోసం కోట్లాది రూపాయల విలువైన భూములు, భవనాలు ప్రభుత్వానికి అప్పగించారని, సొంత నిధులు వెచ్చించి ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి ఆత్మకూరు మున్సిపల్ బస్టాండ్ నిర్మించిన విషయం గుర్తు లేదా అని నిలదీశారు. వారు చేసి మేలు మరిచిపోయి ఇలా విమర్శించడం తగదని చురకలు అంటించారు. తుఫాన్ సహాయంపై చర్చ జరగగా 7వ వార్డు కౌన్సిలర్ సయ్యద్ నౌషాద్ బేగం మాట్లాడుతూ ప్రభుత్వం తుఫాన్ వెలసిన వారం రోజు లోపలే బాధితులకు సహాయం అందించిందని, తమ వార్డులో అందించిన సహాయంపై వివరించారు. 9వ వార్డు కౌన్సిలర్ రమాదేవి మాట్లాడుతూ ప్రతి దానిని రాజకీయం చేయడం సరికాదని, తుఫాన్ సహాయం బాధితులందరికి నిష్పక్షపాతంగా అందడంతో ఎలాంటి వివాదాలు చోటు చేసుకోలేదన్నారు. వైస్ చైర్మన్ డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్, కౌన్సిలర్లు కౌసల్యమ్మ, పి పెంచలయ్య అందరిని సర్దుబాటు చేశారు. కార్మికులకు రానున్న ఒకటో తేదీ రెండు నెలల జీతాన్ని అందించనున్నట్లు చైర్‌పర్సన్ వెంకట రమణమ్మ తెలిపి అజెండాలో పొందుపరిచిన అన్ని పనులను ఏకగ్రీవంగా ఆమోదినట్లు ప్రకటించడంతో సమావేశం ముగిసింది.

డిపో ఎదుట ఉద్యోగుల నిరసన

ఉదయగిరి: స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట శుక్రవారం ఎస్ఎంయూఏ ఆధ్వర్యంలో ప్రజారవాణా ఉద్యోగులు నిరసన కార్యక్రమం చేపట్టారు. సంఘ నాయకులు కాశీవిశ్వనాథ్, నాగరాజు, మౌలాలి మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తమ న్యాయమైన డిమాండ్ పరిష్కరించాలని చేపట్టామన్నారు. చిన్న చిన్న కేసుల్లో ఉన్నతాధికారులు ఉద్యోగులపై కక్ష సాధింపు ధోరణి మానుకుని ఎండీ ఇచ్చిన సర్క్యులర్ అమలు చేయాలన్నారు. 2011 నిబంధనలు ప్రకారం అన్నీ కేటగిరీల్లో పదోన్నతులు కల్పించాలన్నారు. గ్యారేజీల్లోని ఖాళీలను భర్తీ చేయాలన్నారు. మహిళా ఉద్యోగుల ఇబ్బందులు తొలగించాలన్నారు.

విద్యుత్ చార్జీలపై బీజేపీ నిరసన



ఆత్మకూరు రూరల్: కరెంట్ చార్జీలు పెంచడంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం పెంచిన కరెంట్ చార్జీలను వెంటనే తగ్గించాలని బీజేపీ జిల్లా, రాష్ట్ర నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని విద్యుత్ శాఖ డీఈఈ కార్యాలయం ఎదుట శుక్రవారం ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి, ఆత్మకూరు నియోజకవర్గ కన్వీనర్ కంది మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కుడుముల సుధాకర్‌రెడ్డి, కె.సుధాకర్, బీసీ నాయకుడు రంగయ్య, కుంకు బాలయ్య, జగదీష్, పలు మండలాల బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్యాటకాభివృద్ధికి వినతి



వరికుంటపాడు: మండలంలోని నల్లగొండ్లలో ఉన్న గృహమల్లేశ్వరస్వామి దేవాలయ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని మాజీ ఎఫ్‌సీఐ డైరెక్టర్ ఓబుల రెడ్డి ఢిల్లీలో శుక్రవారం కేంద్ర పర్యాటక మంత్రి కిషన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. నందవరం నుంచి నల్లగొండ్ల వరకు ఉన్న సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించేందుకు నిధులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రి గడ్కరీని కలిసినట్లు ఆయన తెలిపారు. ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి సహకారంతో కేంద్ర మంత్రులను కలిసినట్లు తెలిపారు.

పెళ్లింట విషాదం



అవ్వారి సుబ్రహ్మణ్యం (ఫైల్)

సంగం: కుమార్తెకు వివాహం చేసి ఆనందంగా ఉన్న ఆ తండ్రి తన కుమార్తె 16 రోజుల పండగ రోజే గుండెపోటుతో మృతి చెందాడు. వేడుక జరిగిన ఇంట్లో విషాదం నెలకొంది. ఈ ఘటన సంగం శివాజీ సెంటర్‌లో శుక్రవారం జరిగింది. సంగం శివాజీ సెంటర్‌కు చెందిన అవ్వారి సుబ్రహ్మణ్యం (45) స్థానికంగా టిఫెన్ వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వీరికి కుమార్తె, కుమారుడు. ఈ నెల 17వ తేదీ వివాహం చేశాడు. అయితే పచ్చటి తోరణాలతో కళకళలాడిన ఆ ఇంట్లో గురువారం 16 రోజుల పండగ జరగాల్సి ఉంది. సుబ్రహ్మణ్యం ఒక్కసారిగా కుప్పకూలిపోవడంతో కుటుంబ సభ్యులు ఆత్మకూరు వైద్యశాలకు తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు నెల్లూరుకు తరలించాలని సూచించారు. నెల్లూరులో ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఆ కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. కుటుంబ పెద్ద మృతి చెందడంతో ఆ కుటుంబం భోరున విలపిస్తోంది.

ఆడుదాం ఆంధ్రాకు ఐదు మైదానాలు సిద్ధం

జలదంకి: ఈ నెల 26న ప్రారంభం కానున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలకు మండలంలో ఐదు క్రీడా మైదానాలను సిద్ధం చేసినట్లు ఎంపీడీఓ బత్తిన సింగయ్య శుక్రవారం తెలిపారు. జలదంకి, బ్రాహ్మణక్రాక, చింతలపాళెం, సోమవరప్పాడు, జమ్మలపాళెం గ్రామాల్లో మైదానాలను సిద్ధం చేశామన్నారు. వలంటీర్లు అందరూ 13 సచివాలయాల పరిధిలో జరిగే క్రీడా పోటీలపై క్రీడాకారులకు, ప్రేక్షకులకు విస్తృత ప్రచారం కల్పించి ఆటల పండగలో ఎక్కువ మంది పాల్గొనేలా చూడాలన్నారు.

రామానుజన్ జయంతి



బహుమతులు, సర్టిఫికెట్స్‌తో విజేతలైన విద్యార్థులు



సంగం: ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

కావలి: జాతీయ గణిత శాస్త్రవేత్త పరిశోధకుడు శ్రీనివాస రామానుజన్ జయంతిని విశ్రాంత హెచ్ఎం దివంగత బీవీ రత్నమ్మ ఫౌండేషన్ అధ్యక్షుడు ఎంవీ ప్రసాద్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల, పాతూరు మునిసిపల్ పాఠశాలల్లో నిర్వహించారు. విద్యార్థులకు, ప్రతిభపాటవ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్స్ పంపిణీ చేశారు. వక్తలు మాట్లాడుతూ తమిళనాడులో జన్మించిన రామానుజన్ బాల్యం నుంచి గణితంలో మక్కువ చూపారని, ఎన్నో పరిశోధనలు చేసి గణిత శాస్త్రానికే వన్నె తెచ్చారని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్యామ్ ప్రసాద్, హెచ్ఎం ఈశ్వరమ్మ, ఉపాధ్యాయులు సుబ్బారావు, మస్తాన్‌వలి, విశ్రాంత వసతిగృహ సంక్షేమాధికారి ఖాదర్‌బాషా, గంగయ్య, బాలిరెడ్డి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

గణిత దినోత్సవ వేడుకలు

సంగం: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం బుజ్జయ్య గణిత దినోత్సవ వేడుకలను నిర్వహించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులకు గణితానికి సంబంధించిన ముగ్గుల పోటీలు నిర్వహించారు. పలువురు విద్యార్థులు గణితానికి సంబంధించిన ఎగ్జిబిట్లను ఏర్పాటు చేశారు. రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పోటీల్లో విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

సోమశిలలో..

సోమశిల: అనంతసాగరం మండలంలో శుక్రవారం జాతీయ గణిత దినోత్సవాన్ని ఎంఈఓ- 1 బాలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఉప్పలపాడు, సోమశిల జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించారు. విద్యార్థులకు గణిత సమ్మిళిత రంగుల పోటీలను నిర్వహించారు. వివిధ గణిత నమూనాలను తరగతి గదుల్లో ప్రదర్శించారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. శ్రీనివాసరామానుజం గణిత శాస్త్రాభివృద్ధికి చేసిన కృషిని వివరించారు. హెచ్ఎం వీ శంకరయ్య, రమణయ్య, గణిత ఉపాధ్యాయులు ప్రమీల, పెంచలయ్య, రమణయ్య, మురళీ, విద్యార్థులు పాల్గొన్నారు. చిలకలమర్రి జెడ్పీ హైస్కూల్‌లో గణిత ఉపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి హెచ్ఎం సురేష్‌తో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్, గణిత, రంగవల్లుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమణ, మదీనా, మాధవి, శివకృష్ణ, లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

చంచులూరులో..

మర్రిపాడు: జాతీయ గణిత దినోత్సవాన్ని చంచులూరు ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. పాఠశాలలో గణిత ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసి విద్యార్థులు తయారు చేసి ప్రదర్శించిన వివిధ రకాల గణిత ప్రాజెక్ట్‌లను ప్రదర్శించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సుధాకర్, గణిత ఉపాధ్యాయులు వెంకట రమణయ్య, మురళీకృష్ణ, ఇతర ఉపాధ్యాయులు అశోక్, పెంచలరావు, చైతన్య, శివశంకరయ్య, సయీమ్, విద్యార్థులు పాల్గొన్నారు.

చేజర్లలో..

చేజర్ల: ప్రముఖ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని మండలంలోని పలు పాఠశాలల్లో శుక్రవారం నిర్వహించారు. మండలంలోని టీకేపాడు జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థులు గణిత ప్రాజెక్ట్‌లు తయారు చేసి ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కే శ్రీనివాసులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉదయగిరిలో..

వరికుంటపాడు: ఉదయగిరిలోని మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం గణిత శాస్త్రవేత్త శ్రీనివాసరామానుజం జయంతిని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.సుబ్బలక్ష్మమ్మ రామానుజం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రవేత్తలను ఆదర్శంగా తీసుకుని నడుచుకోవాలన్నారు. అనంతరం గణిత పోటీ పరీక్షల్లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఆకుల నరసింహులు, గణిత విభాగ ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



ఉదయగిరిలో రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపల్ తదితరులు



చేజర్ల: ముగ్గులతో శ్రీనివాస రామానుజన్ చిత్రం



సోమశిల: శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



మర్రిపాడు: గణిత ఎగ్జిబిషన్‌లో గణిత ప్రాజెక్ట్‌లను ప్రదర్శిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

టీడీపీ నేత సాగునీరు అటకాయింపు

• 70 ఎకరాల్లో ఎండుతున్న నారుమడులు
• టీడీపీ నాయకుడి నిర్వాకంతో రైతుల ఆందోళన
• కాలువను పరిశీలించిన ఇరిగేషన్ అధికారులు



రైతులతో మాట్లాడుతున్న ఈఈ వెంకటేశ్వరరావు

అనుమసముద్రంపేట: ఓ టీడీపీ నేత స్వార్థపూరిత చర్యలు ఫలితంగా సన్న, చిన్నకారు రైతులకు సాగునీరు అందని పరిస్థితి ఏర్పడింది. అసలు వర్షాభావ పరిస్థితులు సాగునీటి విడుదలను జిల్లా అధికార యంత్రాంగం చాలా జాగ్రత్తగా చేస్తున్నారు. అయితే ఓ బడా రైతు అయిన టీడీపీ నేత మిగతా పొలాలకు వెళ్లే నీటిని తన పొలాలకు మళ్లించుకుంటూ రైతుల కడుపుకొట్టేందుకు ప్రయత్నం చేస్తున్నాడు. దీంతో రైతులు నీటి పారుదలశాఖ ఈఈను ఆశ్రయించారు. స్పందించిన ఈఈ వెంకటేశ్వరరావు శుక్రవారం జేఈలు పెంచలరావు, పుల్లయ్యతో కలిసి కాలువను పరిశీలించారు. రైతుల సమాచారం మేరకు వివరాల మేరకు అనుమసముద్రం చెరువు నుంచి వచ్చే పంట కాలువ కింద సన్న కారు రైతులు దాదాపు 70 ఎకరాల్లో నారుమడులు పోశారు. ఈ కాలువ ఆయకట్టు కింద ఉన్న టీడీపీకి చెందిన బడా రైతు సన్న కారు రైతులకు పంట కాలువ ద్వారా నీరు వెళ్లనివ్వకుండా అడ్డుకట్ట వేసి, తన మిట్ట పొలాలకు మోటార్లు పెట్టి పంపింగ్ చేస్తున్నాడు. ఈ విషయాన్ని నిలదీస్తే దిక్కున్న చోట చెప్పుకోమని రైతులపై దౌర్జన్యానికి దిగుతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ నారు మడులకు నీరందక ఎండిపోతున్నాయని విచారం వ్యక్తం చేస్తూ ఇరిగేషన్ ఈఈకి ఫిర్యాదు చేశారు. గతంలోనూ తమ పొలాలకు నీళ్లు రాకుండా పంటలు ఎండిపోయేలా ఈ నాయకుడు రైతులపై కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. పారుదల కాలువలో మోటార్లు పెట్టి మిట్ట పొలాలకు లిఫ్ట్ చేయడం చట్టవిరుద్ధమని, టీడీపీ నేతగా తన పలుకుబడితో అధికారులను బెదిరిస్తున్నాడని రైతులు చెబుతున్నారు. అతనిపై చర్యలు తీసుకుని తమ పొలాలకు నీటిపారుదల జరిగేలా చూడాలని కోరారు. వీరి వెంట రైతులు వివేకానందరెడ్డి, గౌస్‌బాషా, మురారి, వైఎస్సార్‌సీపీ నేత పులిమి వెంకట రమేష్‌రెడ్డి, రైతులు ఉన్నారు.

రైతుల సమస్య తీర్చిన ఎమ్మెల్యే మేకపాటి



సోమశిల: అనంతసాగరం మండలం కమ్మవారిపల్లిలో ఇటీవల 60 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే విద్యుత్ అధికారులకు ఆదేశాలు ఇవ్వడంతో ఒక్క రోజు వ్యవధిలోనే 60 కేవీ బదులుగా 100 కేవీ నూతన ట్రాన్స్‌ఫార్మర్ బిగించి రైతుల ఇబ్బందులను తొలగించారు. ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డికి, విద్యుత్ శాఖ అధికారులకు పార్టీ నేత ఎద్దుల శ్రీనివాసుల రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం



బాధిత కుటుంబాలకు చెక్కును అందజేస్తున్న కంచి పరమేశ్వరరెడ్డి, తదితరులు

ఆత్మకూరురూరల్: పట్టణానికి చెందిన శ్రీసాంబశివ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదల అంత్యక్రియలకు ఆర్థిక సాయం అందజేశారు. నిత్యాన్నదాత, ట్రస్ట్ నిర్వాహకుడు కంచి పరమేశ్వరరెడ్డి పట్టణంలోని రెండు కుటుంబాలకు రూ.10 వేలు చొప్పున శుక్రవారం ఆర్థిక సాయం అందజేశారు. 17వ వార్డుకు చెందిన తాపీ కార్మికుడు షేక్ ఖాసీం బాషా, 20వ వార్డుకు చెందిన గురున్నాథం రాజయ్య ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబ సభ్యులకు ట్రస్ట్ తరఫున సాయం అందించారు. ఈ కార్యక్రమంలో మెప్మా ఆర్‌పీ తాహేరా, విశ్రాంత హెచ్ఎం కేవీ శేషారెడ్డి, రామ్‌పల్లి ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిర్ణీత కాలువల వరకే సాగు నీరు

• ఎంవీ రమణారెడ్డి, ప్రాజెక్ట్ డివిజన్ ఈఈ

ఆత్మకూరురూరల్: సోమశిల జలాశయం నుంచి ఉత్తరకాలువ ద్వారా నిర్ణయించిన కాలువల వరకే సాగునీరు అందించనున్నట్లు సోమశిల ప్రాజెక్ట్ డివిజన్ 4 ఈఈ ఎంవీ రమణారెడ్డి తెలిపారు. తన కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఐఏబీ సమావేశంలో నిర్ణయం మేరకు ఉత్తర కాలువకు రెండు టీఎంసీల నీటిని కేటాయించినట్లు అవి కాలువ ప్రారంభం నుంచి 32 ఆర్ (44.417 కి.మీ.) వరకు సరఫరా చేయనున్నట్లు తెలిపారు. 12,795 ఎకరాలు నేరుగా కాలువల కింద సాగుకు అనుమతించినట్లు తెలిపారు. చెరువుల్లో ఉన్న నీటిలభ్యతతో మరో 10,630 ఎకరాల సాగుకు అనుమతించినట్లు వివరించారు. ఉత్తర కాలువ ద్వారా రాళ్లపాడు ప్రాజెక్ట్‌కు ఒక టీఎంసీ నీటిని తాగునీటి కోసం కేటాయించినట్లు, ఫిబ్రవరి మొదటి వారంలో సరఫరా చేయనున్నట్లు వివరించారు. రైతులు అందుబాటులో ఉన్న నీటి వనరులను దృష్టిలో పెట్టుకుని ఆరుతడి పైర్లను, మెట్ట పైర్లను సాగు చేసుకోవాలన్నారు.

కేంద్ర పథకాలపై అవగాహన పెంచుకోవాలి



కేంద్ర ప్రభుత్వ పథకాల క్యాలెండర్లు ప్రదర్శిస్తున్న నాయకులు, అధికారులు

ఆత్మకూరురూరల్: కేంద్రం వివిధ వర్గాల ప్రజల కోసం అమలు చేస్తున్న పథకాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని రాష్ట్ర బీజేపీ నాయకుడు కర్నాటి ఆంజనేయరెడ్డి అన్నారు. మండలంలోని దేపూరులో శుక్రవారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో ఆయన మాట్లాడారు. ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ మాట్లాడుతూ పీఎం కిసాన్ ద్వారా రైతులకు ప్రతి ఏటా రూ.6 వేలు చొప్పున కేంద్రం జమ చేస్తుందన్నారు. వ్యవసాయ అధికారి కిషోర్ బాబు, వైద్యాధికారి డాక్టర్ అనూషా కుమారి తదితరులు తమ శాఖలకు సంబంధించిన పురోగతిని వివరించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వెంకటేశ్వర్లు, ఆత్మకూరు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కంది మల్లికార్జునరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి, వాసిపల్లి సుధాకర్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

సెమీ క్రిస్మస్ సంబరాలను జయప్రదం చేయండి

• కలివెల ఎలీషాకుమార్



విలేకరులతో మాట్లాడుతున్న క్రిస్మస్ సంబరాల కమిటీ సభ్యులు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి నేతృత్వంలో నిర్వహిస్తున్న సెమీ క్రిస్మస్ సంబరాలను జయప్రదం చేయాలని సంబరాల కమిటీ నిర్వాహకుడు కలివెల ఎలీషాకుమార్ కోరారు. పట్టణంలోని రవితేజ కల్యాణ మండపంలో శుక్రవారం రాత్రి కమిటీ సభ్యులు విలేకరులతో మాట్లాడారు. ఇదే కల్యాణ మండపంలో శనివారం సాయంత్రం ఐక్య సెమీ క్రిస్మస్ సంబరాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు, అన్ని క్రిస్టియన్ సంఘాలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కమిటీ కార్యవర్గ సభ్యులు ఎస్ రవికుమార్, జాన్ ప్రదీప్, కె శ్రీనివాసులు, బాలసుందరం, పి పుల్లయ్య, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

• ఎంపీపీ మెట్టుకూరు శిరీష



మాట్లాడుతున్న ఎంపీపీ మెట్టుకూరు శిరీష

కలిగిరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారని ఎంపీపీ మెట్టుకూరు శిరీష తెలిపారు. కలిగిరిలోని పీహెచ్‌సీలో వైద్యశాల అభివృద్ధి కమిటీ (హెచ్‌డీసీ) శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.25 లక్షల వరకు వైద్యం చేసుకునే అవకాశం కల్పించి పేదల జీవితాల్లో జగనన్న వెలుగులు నింపారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకే వైద్యులు వచ్చి వైద్య సేవలు అందించడం జరిగిందన్నారు. సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలన్నారు. కరోనా విస్తరిస్తుందనే హెచ్చరికల నేపథ్యంలో అధికారులు, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు గీతారెడ్డి, మస్తాన్‌బాబు, ఎంపీడీఓ జి. వెంకటేశ్వరరావు, తహసీల్దార్ శ్రీరామకృష్ణ, సర్పంచ్‌లు దేవనబోయిన వెంకటసుబ్బయ్య, రాగి దివ్య, మారేళ్ల దొరసానమ్మ తదితరులు పాల్గొన్నారు.